సాక్షి పెద్దపల్లి

బుధవారం । 20 । మార్చి । 2024



పోషణ సంబురం

జ్యోతినగర్: జాతీయ పోషణ మాసం సందర్భంగా ఎన్టీపీసీ టౌన్‌షిప్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సుజాత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పిల్లలకు మిఠాలు ఇచ్చారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6.05	గురు 4.44

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.4/23.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా ఎండగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రంజాన్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

పెద్దపల్లిరూరల్: రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మసీదులు ఉన్న ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పర్చేందుకు రోడ్ల మరమ్మతు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పైప్‌లైన్ లేని ప్రాంతాలకు నీటి టాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేయాలన్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.

చెక్‌పోస్టులో తనిఖీలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ రమేశ్

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి – మంచిర్యాల అంతర్‌జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద అంతర్గాం పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ మంగళవారం చెక్‌పోస్టు తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలో పాల్గొన్నారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రామగుండం సీఐ అజయ్, అంతర్గాం ఎస్సై వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలన లక్ష్యం



మాట్లాడుతున్న లెప్రసీ అధికారి జయాకర్

రామగుండం: కుష్ఠు నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా లెప్రసీ అధికారి జయాకర్ తెలిపారు. అంతర్గాం మండలం ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రుకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిన్నారులు, మహిళలు రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్, అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమల, ఆశ వర్కర్ పెసరి జ్యోతి, స్రవంతి, మగ్గిడి శిరీష, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: వృద్ధి చెందుతున్న ఆధునిక శాస్త్ర, సాంకేతికతతోపాటే సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని సైబర్ క్రైం సీఐ కృష్ణమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లలో అపరిచితులతో మెసెజ్, చాటింగ్ చేయొద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, ఓటీపీ, పిన్ నంబర్లను ఇతరులెవరికీ చెప్పొద్దన్నారు. సైబర్ క్రైంకు గురైన వెంటనే 1930 నంబరుకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో వతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 7,712 మంది విద్యార్థులకు 7,705మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మూడు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 16పరీక్ష కేంద్రాలు, జిల్లాస్థాయి పరిశీలకులు ఆరు పరీక్ష కేంద్రాలను సందర్శించారని ఆమె వివరించారు.

అదుపుతప్పి కారు బోల్తా



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వీరందరూ మైనర్లు అని స్థానికులు తెలిపారు. గాయపడ్డ వీరిని గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



కవ్వంపల్లి సత్యనారాయణ

మేడిపల్లి సత్యం

చింతకుంట విజయరమణారావు

ఆది శ్రీనివాస్

సిరిసిల్లలోనూ సర్వర్ రూం



ప్రణీత్‌రావు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్తకోణం
- నలుగురు సిబ్బందితో ప్రణీత్‌రావు ప్రత్యేక నిఘా

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కొత్త విషయం బయటపడింది. ఈ కేసులో తీగ లాగిన కొద్దీ దర్యాప్తు అధికారులకు కొత్త విషయాలు తెలుస్తున్నాయి. సస్పెండెడ్ డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కోసం సిరిసిల్లలోనూ ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు సమాచారం. తాజాగా ఈ కేసులో ప్రణీత్‌రావుకు సహకరించిన వారందరినీ ఒక్కొక్కరిగా అరెస్టు చేస్తున్నారు. ట్యాపింగ్ ఉదంతం వెలుగుచూసిన కొత్తలోనే హైదరాబాద్‌లోని ఎస్ఐబీ కార్యాలయం కేంద్రంగా ఈ వ్యవహారం జరిగిందని అనుకున్నా.. తర్వాత వివిధ జిల్లాల్లోనూ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ప్రణీత్‌రావు సిరిసిల్లలోనూ ట్యాపింగ్ కోసం ప్రత్యేకంగా సర్వర్‌రూం, ఎస్సై నేతృత్వంలో ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలిసింది. వాస్తవానికి 2021లోనే కరీంనగర్ వేదికగానే పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ ప్రణీత్‌రావు ఉదంతాన్ని బయటపెట్టి సంచలనం రేపారు. తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా అదే ఆరోపణలపై పంజగుట్టలో కేసు నమోదు కావడం, డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్ట్‌కావడం, ఇందుకు సంబంధించి ఆయనకు సహకరించిన సిబ్బందిని కూడా పోలీసులు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

సిరిసిల్ల కేంద్రంగా..

సిరిసిల్లలో ప్రణీత్‌రావు ఆదేశాల మేరకు పనిచేసిన సిబ్బందిని సైతం కేసు దర్యాప్తు చేస్తున్న పంజగుట్ట పోలీసులు విచారించే అవకాశాలున్నాయి. వరంగల్‌లో ఒకటి, సిరిసిల్లలో మరో సర్వర్ ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. సీఎం సన్నిహితుడు, కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ లీడర్ సత్తు మల్లేశ్ ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌రావు డిలీట్ చేసిన చాటింగ్ రీట్రీవ్‌లో సత్తు మల్లేశ్ కాంటాక్ట్ వెలుగుచూడటం గమనార్హం. సత్తు మల్లేశ్ ఫోన్ ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్, చింతకుంట విజయరమణారావుల సంభాషణలు విన్నారని అనుమానిస్తున్నారు. సిరిసిల్లలోని సర్వర్ రూం ఆధారంగానే ఉమ్మడి జిల్లాలోని ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారని భావిస్తున్నారు. అయితే, వీరు కేవలం రాజకీయ నాయకుల ఫోన్లే ట్యాప్ చేశారా? జాబితాలో ఇతరులు కూడా ఉన్నారా? అన్న విషయం తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గతేడాది డిసెంబర్ 4వ తేదీన ప్రభుత్వం మారడంతో ప్రణీత్‌రావు బేగంపేట ఎస్ఐబీ కార్యాలయంలోని సర్వర్ రూంలోని అన్ని ఆధారాలు ధ్వంసంచేశాడు. అందులో భాగంగా సిరిసిల్ల సర్వర్‌లోని ఆధారాలను కూడా దొరకుండా చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని నాశనం చేసే ముందే ప్రణీత్‌రావు ఆ వివరాలను పెన్‌డ్రైవ్‌ల ద్వారా కాపీ చేసుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

ముంచుకొస్తున్న ముప్పు!



- 'శ్రీపాద ఎల్లంపల్లి'లో పడిపోతున్న నీటి నిల్వలు
- ప్రాజెక్టు నుంచి ఏటా 5 టీఎంసీల కేటాయింపు
- తగ్గిన నీటినిల్వలతో యూరియా ఉత్పత్తికి విఘాతం
- ఐదు రాష్ట్రాలపై తీవ్రప్రభావం చూపే అవకాశం
- ఆందోళన చెందుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో యూరియా ఉత్పత్తికి ముప్పు పొంచి ఉంది. నీటి కొరత ఇందుకు కారణమవుతోంది. ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం అవసరాల కోసం రామగుండం సమీపంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఏటా ఐదు టీఎంసీల నీటిని రాష్ట్రప్రభుత్వం కేటాయిస్తూ వస్తోంది. అయితే, ప్లాంట్ ప్రారంభం నుంచి నేటివరకు నీటి సమస్య తలెత్తలేదు. కానీ, ఈసారి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటినిల్వలు కనిష్టస్థాయికి పడిపోవడంతో ముప్పు పొంచిఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టులో 9 టీఎంసీల నిల్వ..

- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9 టీఎంసీలే ఉన్నాయి.
- ఈ వేసవిలో రైతులు పండిస్తున్న పంటలకు సరిపడా యూరియా ఉత్పత్తి చేయాలంటే ఏప్రిల్, మేలో కర్మాగారంలో నిరంతరం ఉత్పత్తి కొనసాగించాలి.
- ఇందుకోసం సరిపడా నీరు అవసరమని అధికారులు చెబుతున్నారు.
- అయితే, కనిష్టస్థాయికి నీటి నిల్వలు పడిపోతే.. ఆర్ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరా నిలిపివేస్తారు.
- ఇదే జరిగితే.. కర్మాగారంలో యూరియా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంది.
- నిర్వహణ సమస్యలతో గత ఫిబ్రవరిలో 18 రోజులపాటు ప్లాంట్ షట్‌డౌన్ చేశారు.
- అప్పుడు యూరియా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది.
- ఇప్పుడు నీటి సమస్యతో యూరియా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల రైతులు ఆందోళన చెందాల్సి వస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి..

ప్రస్తుతం వేసవి కావడంతో రామగుండం ఎరువుల కర్మాగారంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తికి సరిపడా నీరు సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. మనరాష్ట్రంలో ప్రస్తుతం యూరియాకు అధిక డిమాండ్ ఉంది. యాసంగి పంటలకు యూరియా కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో ఆర్ఎఫ్‌సీఎల్‌లో నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. కర్మాగారంలో ఉత్పత్తికి సరిపడా నీరు అందుబాటులో లేకుంటే.. రెండు నుంచి మూడు నెలలపాటు ప్లాంట్‌ను షట్‌డౌన్ చేస్తారు. తద్వారా యూరియా ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది. మూడు నెలల్లో సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని అధికారులు వివరిస్తున్నారు. ఈ పరిస్థితి తలెత్తితే తెలంగాణలో యూరియా కష్టాలు ప్రారంభమవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారానికి నీరు సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తాం

- రామగుండంలో మార్పు మొదలైంది
- ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అవినీతి రహిత పాలన అందిస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రామగుండానికి పూర్వవైభవం తెస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పేదలకు ఏటా 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, మారెల్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు నష్టం కలుగకుండా చూస్తా..

రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయే వ్యాపారులకు నష్టం వాటిల్లకుండా చూస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి రీగల్ షూమార్టు వరకు కాలినడకన పర్యటించిన ఎమ్మెల్యే.. విస్తరణలో షాపులు కోల్పోతున్న వ్యాపారులను కలిసి మాట్లాడారు. అభివృద్ధి కోసం చేపట్టిన రోడ్ల విస్తరణకు సహకరిస్తున్న వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్న కార్మిక కుటుంబాలను కలిసి భరోసా ఇచ్చారు. ఈప్రాంతాన్ని వ్యాపార ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నామని రాజ్‌ఠాకూర్ అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రత్యేక కమిటీని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రకటించారు. అభ్యర్థి విజయం కోసం కమిటీ కార్య నిర్వాహక కమిటీ పనిచేయాలని సూచించారు. బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, ఎండీ ముస్తాఫా, గట్ల రమేశ్ పేర్లతో కమిటీని ఆయన ప్రకటించారు.

మానేరు తీరంలో విమానం చక్కర్లు



తక్కువ ఎత్తులో వెళ్తున్న జెట్ విమానం

మంథని: ప్రొఫెసర్‌జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల, పెద్దపల్లి జిల్లా మంథని, ముత్తారం మండలాల పరిధిలోని మానేరు తీరం వెంట వారం రోజులుగా జెట్ విమానం చక్కర్లు కొడుతోంది. ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామాలకు సమీపం నుంచి విమానం వెళ్తుండడం ప్రజల్లో ఆసక్తి కలిగిస్తున్నా.. ఇటు వైపు ఎందుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మంగళవారం భారీ శబ్దంతో ముత్తారం మండలం రామకిష్టాపూర్ గ్రామం మీదుగా తాడిచర్ల గ్రామానికి వెళ్లి.. మళ్లీ కాసేపటికే మంథని వైపు రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. అసలు విమానం ఇటు వైపు వారం రోజులుగా ఎందుకు వస్తోందనే ప్రశ్న వారి మెదళ్లను తొలిచేస్తోంది. ఏదైనా సర్వే చేస్తున్నారా? అనే విషయం తెలియక అటు ప్రజలు, ఇటు అధికారులు కూడా హైరానా పడుతున్నారు. తమకు సమాచారం లేదని స్థానిక పోలీసులు కూడా స్పష్టం చేస్తున్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



కిశోర్‌ను సన్మానిస్తున్న రాంచందర్

జ్యోతినగర్(రామగుండం): జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానాను కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సన్మానించారు. రామగుండం ప్రాంతానికి చెందిన రాంచందర్.. మంగళవారం న్యూఢిల్లీ లోక్ నాయక్ భవన్‌లో కిశోర్ మక్వానాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం సమావేశమై పలు అంశాలను చర్చించారు.

పత్తి ధర రూ.7,563

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి క్వింటాలు గరిష్ట ధర రూ.7,563 పలికింది. కనిష్ట ధర రూ.6,355, సగటు ధర రూ.7,321గా నమోదైందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

మంచిర్యాల–వరంగల్ మధ్య గ్రీన్‌ఫీల్డ్ కారిడార్


- భూసేకరణకు ప్రతిపాదనలు
- గడువులోగా సర్వే పూర్తిచేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: మంచిర్యాల – వరంగల్ మధ్య నాలుగులేన్ల గ్రీన్‌కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టేందుకు సర్వే నిర్వహించి శనివారంలోగా ప్రతిపాదనలు, నివేదికలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో ఆయన గ్రీన్‌కారిడార్ పనులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూసేకరణ కోసం సర్వే చేసి ప్రతిపాదనలను అందించాలన్నారు. అటవీ, ఆర్ అండ్ బీ, గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ ఇంట్రా, ఉద్యానవనశాఖ అధికారులు తమ పరిధిలో జరిగే నష్టాలను వివరించడంతోపాటు పునరుద్ధరణకు చేపట్టాల్సిన పనులపై సంపూర్ణ నివేదిక అందించాలని ఆదేశించారు. కారిడార్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను అధికారులు కట్టుదిట్టంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. సంతృప్తి పడని రైతులు అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామనే భరోసా కల్పిస్తూ సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, అటవీశాఖ అధికారి శివయ్య, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



నర్సరీ పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పాలకుర్తి(రామగుండం): వచ్చే వర్షాకాలంలో చేపట్టే హరితహారం కోసం అవసరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని, ప్రస్తుత వేసవి దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) అరుణశ్రీ ఆదేశించారు. రాణాపూర్ నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొక్కల రకాలు, వాటి సంఖ్య గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పల్లెప్రకృతివనంలో ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఎంపీడీవో శశికళ, మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా పాల్గొన్నారు.

సరిహద్దుల్లో అప్రమత్తం

- నీల్వాయి, కోటపల్లిలో ఫెర్రీ పాయింట్లు
- డ్రోన్లతో నిత్యం పోలీసుల నిఘా
- బోట్లు, పడవల ద్వారా గాలింపు
- పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- మావోయిస్టుల కట్టడికి వ్యూహాత్మక చర్యలు
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ లక్ష్యం



బోట్‌లో ప్రయాణిస్తున్న సీపీ శ్రీనివాస్, పోలీసులు



డ్రోన్ ద్వారా సరిహద్దు అడవుల్లో నిఘా



పొరుగు రాష్ట్రాల పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అత్యంత పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులతో ఇప్పటికే సమన్వయ సమావేశం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఎన్నికల ప్రత్యేక తనిఖీల కోసం 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలైన రాష్ట్ర సరిహద్దులు, మారుమూల అటవీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రధానంగా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో పోలీసు నిఘా పెంచారు. ఈక్రమంలో గత శుక్రవారం మూడు రాష్ట్రాల పోలీసు అధికారులు సమష్టిగా సమావేశం నిర్వహించారు. మావోయిస్టుల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని నిర్ణయించుకున్నారు. అలాగే పాత నేరస్తులు, రౌడీషీటర్లపై దృష్టి సారించారు. పార్లమెంట్ ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని అడ్డుకునేందుకు చెక్‌పోస్టుల ద్వారా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బలగాలను రప్పిస్తున్నారు. ప్రతీఓటరు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా పోలీసులు ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలు, సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. మరోవైపు.. అసాంఘిక శక్తులు, మావోయిస్టుల కట్టడికి అనుసరించాల్సిన వ్యూహాలపై మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. రామగుండం పోలీస్ కమిషనరేట్, సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలుజారీ చేశారు. మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. సరిహద్దు ప్రాంతాల వద్ద భద్రతా చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నారు.

ఆడి.. పాడి.. కేక్ కట్‌చేసి..



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ–1 ఏరియా బంగ్లాస్ ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, వేషధారణలకు బంగ్లాస్ ఏరియా వేదికగా మారింది. లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు చింతల లక్ష్మి, సభ్యులు చిలక లక్ష్మి, రమ, తార, కవిత, కల్యాణి, హేమలత, శ్రీవాణి, జీఎం సతీమణులు మాలతి, పద్మ, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏరియా ఆస్పత్రి డాక్టర్లు రామలక్ష్మి, ఇందిరను శాలువాలతో సన్మానించారు.

క్లుప్తంగా

లక్ష్య సాధనకు శ్రమించాలి



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు సూచించారు. మంగళవారం ప్రొడక్షన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులకు భోజన ప్యాకెట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం కోసం ప్రొడక్షన్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి రాధాకృష్ణ, ఏఐటీయూసీ ప్రతినిధి డీటీరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు జి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితి సమీపంలో ఓ వృద్ధురాలి మృతదేహం మంగళవారం లభించింది. సాయి సేవా సమితి సమీపంలో వృద్ధురాలి శవం ఉందని స్థానికులు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్‌కు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధురాలి ఆచూకీ లభించకపోవడంతో ఆమె మృతదేహాన్ని గోదావరిఖని ప్రాంతీయ ఆస్పత్రిలోని మార్చురికి తరలించారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే 87126 56526 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

పెద్దపల్లిరూరల్: జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలకు మంగళవారం నామినేషన్లు స్వీకరించారు. సహకార సంఘంలోని 11 డైరెక్టర్ పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో పదవులన్నీ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి రామ్మోహన్ తెలిపారు. డైరెక్టర్లుగా ఎన్నికైన వారిలో వీరస్వామి, కొలిపాక నరసయ్య, కందుల శ్రీనివాస్, తాళ్ల తిరుపతి, చెట్ల శ్రీనివాస్, పెద్దపల్లి సుజాత, క్రాంతి కుమార్, పోలవేణి మొండయ్య, సారయ్య, బోయిని శ్రీకాంత్, రేండ్ల కోటయ్య ఉన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్య..!

మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవమైన పాలక మండలి సభ్యులు సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కొలిపాక నర్సయ్య ఎన్నిక ఏకగ్రీవం కానున్నట్లు విశ్వసనీయ సమాచారం.



నర్సయ్య

వినిపించని 'కిచకిచ'

- దెబ్బతింటున్న ప్రకృతి సమతుల్యత
- అంతరించిపోతున్న ఊరపిచ్చుకలు
- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

పిచ్చుకలు అడవిలో నాలుగైదేళ్లు బతుకుతాయి. పట్టణాల్లో చెప్పలేం! ఎందుకంటే.. ఎవరి గింజల్ని వాళ్లు వెతుక్కోడానికి పరుగులు తీస్తున్న తరుణంలో.. పిచ్చుకల కోసం ఇంటి ఎదుట కంకులు వేలాడదీసేవాళ్లెవరు? మట్టి పాత్రలో నీళ్లు పెట్టేవాళ్లెవరు? అందుకే.. పెంకుటిళ్ల మాదిరిగానే వాటి ఆయుష్షు అర్ధంతరంగా తీరిపోతోంది.



ఆకర్షిస్తున్న ఊరపిచ్చుక గూళ్లు



అందమైన ఊరపిచ్చుకలు

కోల్‌సిటీ(రామగుండం): సుమారు ఇరవయేళ్ల వెనక్కి వెళ్తే.. మన ఇల్లు, పెరట్లో కిచకిచమంటూ ఆహ్లాదకర శబ్దాలతో సందడి చేస్తూ ఆట పట్టించేవి పిచ్చుకలు. మానవ జీవితాల్లో మమేకమై గ్రామాలు, పట్టణాలు.. ఇలా ఎక్కడపడితే అక్కడ కనిపించేవి. నేడు ఆ పరిస్థితి లేదు. పిచ్చుకలు క్రమంగా అంతరించిపోతున్నాయి. పర్యావరణానికి మేలుచేసే ఈ పక్షిజాతి కనుమరుగు కావడంతో జీవవైవిధ్యం దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. జీవనశైలిలో చోటుచేసుకుంటున్న పెనుమార్పులు 'ఊరపిచ్చుక'లపై బ్రహ్మాస్త్రంగా మారుతున్నాయి. బుధవారం 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' సందర్భంగా కథనం..

అంతరించిపోవడానికి ఇవే కారణాలు..

- పిచ్చుకలు అంతరించిపోవడానికి నిపుణులు పలు కారణాలు వెల్లడిస్తున్నారు. నానాటికీ పెరిగిపోతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.
- సెల్‌ఫోన్ టవర్ల ద్వారా విడుదలయ్యే రేడియేషన్‌తో పిచ్చుకలు ప్రాణాలొదులుతున్నాయి.
- అంతరిస్తున్న పల్లెదనం, మాయమైన ఇంటి పెరటి, పెరిగిపోతున్న పట్టణీకరణ, నగరీకరణతో పిచ్చుకలు గూళ్లు పెట్టుకోవడానికి అవకాశం లేకపోవడం.
- వంట పొలాల్లో పురుగు నివారణకు వినియోగిస్తున్న విషపూరిత రసాయన మందులు సైతం పిచ్చుకల ప్రాణాలు హరిస్తున్నాయి.
- రసాయనాలతో మిళితం చేసిన పండ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి తదితర జీవన శైలీలో వస్తున్న పెను మార్పులతో పిచ్చుకల జీనవం దయనీయంగా మారుతోంది.
- అధునాతన కాంక్రీట్ కట్టడాలతో పిచ్చుక గూళ్ల నిర్మాణం తగ్గిపోతోంది.

ప్రతిఒక్కరూ కృషి చేయాలి



పిచ్చుకల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. పిచ్చుకలతో సమాజానికి ఎంతోమేలు జరుగుతుంది. మన ఇంటి చుట్టూ ఉన్న పిచ్చుకలను కాపాడుకోవాలి. వాటి మనుగడుకు అవసరమైన గూళ్లు, ఆహారం, నీరు ఇంటి పరిసరాలల్లో అందుబాటులో ఉంచాలి. అందుకే సదాశయ ఫౌండేషన్ ఓదెల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా మట్టి చిప్పలు పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది.

– భీష్మాచారి, రాష్ట్ర కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్

పక్షిజాతికి గౌరవం..

పిచ్చుక జాతిని కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలియజేస్తూ ప్రభుత్వం తపాలా బిళ్ల కూడా విడుదల చేసింది. ఈ స్టాంప్‌పై పిచ్చుక ఫొటో ముద్రించి పిచ్చుకజాతిని గౌరవించింది. అంతేకాకుండా ఎన్ఎఫ్ఎస్ గుజరాత్ రాష్ట్రంలో మార్చి 2011 నుంచి పిచ్చుక అవార్డులు ఇస్తోంది.

ఆ కిచకిచలే వేరు..

చిన్నగా.. బొద్దుగా ఉండే పిచ్చుకల కిచకిచల శబ్దాలే సపరేటు. గింజలు, చిన్నచిన్న కీటకాలే వీటికి ఆహారం. ఊర పిచ్చుక గూళ్లు చూడ్డానికి అందంగా, చూడముచ్చటగా ఉంటాయి. ఆడపిచ్చుకలు గుడ్లు పెట్టే ముందు మగ పిచ్చుకలు గడ్డి పోరకలతో అందంగా గూళ్లు తయారు చేసుకుంటాయి. వీటిలో ఆడపిచ్చుకలు గుడ్లు పెట్టి 11 నుంచి 14 రోజుల వరకు పొదిగి పిల్లలు చేస్తాయి. ఏడాదికి రెండు సార్లు పిచ్చుకలు పొదుగుతాయి. అయితే పిల్లల సంరక్షణ మాత్రం మగపిచ్చుకలు చూసుకుంటాయి.

ఊపిరి పోద్దాం..

పిచ్చుకలను కాపాడుకోకుంటే భవిష్యత్‌లో ఇంటర్నేట్లు, పాఠ్యపుస్తకాలల్లో మాత్రమే ఊర పిచ్చుకలను చూడాల్సిన పరిస్థితి రాబోతుందని పక్షిప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చుకలకు సంరక్షణ కల్పించకుంటే అరుదైన పక్షుల జాబితాలో చేరే ప్రమాదం కూడా ఉంది. ఊర పిచ్చుకలు సంచరిస్తున్న నివాసాల్లో ధాన్యం వేయడం, కిటికీలు, డాబాలపై కృత్రిమ పిచ్చుక గూళ్లు తయారు చేయడం తదితర వాటితో పిచ్చుకలను కాపాడాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

అధికారుల మనోధైర్యం దెబ్బతీయొద్దు

- సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు పానుగోటి శ్రీనివాస్



ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు శ్రీనివాస్, కిరణ్‌రాజ్‌కుమార్

గోదావరిఖని: ప్రమాదంపై డీఎంఎస్ విచారణలో ఉండగానే అధికారిని సస్పెండ్ చేయడం తమ మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు పానుగోటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 16న మందమర్రి ఏరియా స్టోర్స్‌లో జనరల్ మజ్దూర్ పనులు చేస్తుండగా రోప్‌వైరు తెగి కర్రె రాజు కార్మికుడు ప్రమాదానికి గురై మరణించాడన్నారు. కార్మికుడి మృతికి విచారం వ్యక్తం చేస్తున్నామని, అయితే, అధికారుల విచారణ పురోగతిలో ఉన్నక్రమంలో అధికారి జె.శశిధర్‌ను సస్పెండ్ చేయాలనే నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కిరణ్‌రాజ్‌కుమార్, పెరుమాళ్ల శ్రీనివాస్, కోలా మల్లేశ్, అంజయ్య, దామోదర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

డీజీఎంఎస్ విచారణ జరపకుండానే ప్రమాదానికి బాధ్యుడిని చేస్తూ అధికారిని సస్పెండ్ చేయడం సరికాదని ఆర్జీ–2 అధికారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన సంఘటనకు బాధ్యుడిగా చేస్తూ అక్కడ పనిచేస్తున్న అధికారి శశిధర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా అధికారుల్లో మనోస్థైర్యం దెబ్బతింటుందన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో అనుక్షణం శ్రమిస్తున్న అధికారులపై ఈప్రభావం చూపుతుందని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధికారుల సంఘం ఆర్జీ–2 అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు రాంరెడ్డి, నరేశ్, జనార్దన్, సుగుణాకర్, ఏరియా అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో లైఫ్ సపోర్ట్ శిక్షణ

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్
- 4 రోజుల శిక్షణ శిబిరం ప్రారంభం

గోదావరిఖని: సింగరేణి ఆస్పత్రి వైద్యులకు అడ్వాన్స్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సింగరేణి ఏరియా ఆస్పత్రిలో శిక్షణను జీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణ భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. పెద్దలు, చిన్నపిల్లలు, నవజాత శిశువులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈఎంఆర్ఐ డాక్టర్స్ బృందం సింగరేణి ఏరియా ఆస్పత్రికి చేరుకుని శిక్షణ ప్రారంభించారు. బీఎల్ఎస్(బేసిక్ లైఫ్ సపోర్టు), ఏసీఎల్ఎస్(అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు), కార్డియాక్ లైఫ్ సపోర్టులో నాలుగు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని అన్నారు. వైద్యులకు రెండు రోజులు శిక్షణ, స్టాఫ్ నర్సులకు ఒకరోజు, వార్డ్ అసిస్టెర్స్‌కు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, డాక్టర్లు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

నెమలిని చంపిన కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్



స్వాధీనం చేసుకున్న రైఫిల్, తూటాలు

- రైఫిల్, తూటాలు, గొడ్డలి, కారు స్వాధీనం
- డీఎస్పీ రఘుచందర్

పెగడపల్లి(ధర్మపురి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామంలో నెమలిని చంపి పట్టుబడిన నిందితులను పోలీసులు అరెస్టు చూపారు. మంగళవారం మల్యాల సీఐ రవి, ఎస్సై రామకృష్ణతో కలిసి డీఎస్పీ రఘుచందర్ పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ, మల్యాల మండల కేంద్రానికి చెందిన జవ్వాజి రాజు అనే ఇద్దరు వేటగాళ్లు సోమవారం రాత్రి దోమలకుంట శివారులో నాటు తుపాకీతో నెమలిని కాల్చిచంపి కారులో తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దోమలకుంటకు చేరుకుని వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో కారును తనిఖీ చేయగా లైసెన్స్ లేని జీరో పాయింట్ 22 ఇంచెస్ రైఫిల్, నెమలి కళేబరం లభ్యమైంది. కారులో ఉన్న ఇద్దరిని విచారించగా రైఫిల్‌తో నెమలిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. నెమలితో పాటు రైఫిల్, 33 తూటాలు, గొడ్డలి స్వాధీనం చేసుకున్నారు. కాగా సత్యనారాయణ 2017లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో జింకను హతమార్చిన కేసు ప్రధాన నిందితుడని, ఇంకా కేసు కొనసాగుతుందని డీఎస్పీ పేర్కొన్నారు. నెమలిని హతమార్చిన సత్యనారాయణ, కారు డ్రైవర్ రాజును మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై, ఏఎస్సై సత్తయ్య, సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీతిసింగ్ అభినందించారు.

పేకాటస్థావరంపై దాడి.. రూ.14.48లక్షలు స్వాధీనం

- 10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
- రామగుండం సీపీ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడిచేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అస్నాద గ్రామ శివారు మామిడితోటలో కొందరు డబ్బులు పెట్టి మూడుముక్కలాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారని, వారినుంచి 10 సెల్‌ఫోన్లు రూ.14.48లక్షల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని వివరించారు. కొందరు ముఠాగా ఏర్పడి పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, ఆసిఫాబాద్, ఏరియాల నుంచి పేకాటరాయుళ్లను పిలిపించుకుని పేకాట ఆడుతున్నట్లు వివరించారు. కొంత పెట్టుబడి పెట్టి, అటవీ ప్రాంతాల్లో రోజుకు ఒక ఏరియాలో పేకాటస్థావరాలు ఏర్పాటుచేసి, ఆటగాళ్ల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారని అన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని పేకాట నిర్వహిస్తున్నారన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుపడిన వారు మంచిర్యాల, చెన్నూర్ మండలం నాగాపురం, గోదావరిఖని మల్కాపురం, హనుమాన్‌నగర్, మంచిర్యాల జిల్లా వేంపల్లి, వరంగల్ పోర్ట్, కొలనూరు, రెబ్బెన, సీసీసీ నస్పూర్‌కు చెందిన వారు ఉన్నారని సీపీ వివరించారు.

ఇసుక లారీల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దరాతుపల్లి, కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు సమాచారం. ఈవిషయమై ఎస్సై ఓంకార్ యాదవ్‌ను వివరణ కోరగా పెద్దరాతుపల్లి మానేరు నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు చేసి లారీలను సీజ్‌చేసినట్లు వివరించారు. లారీ డ్రైవర్లు, ఓనర్లను బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని ఎస్సై తెలిపారు.

పందెం కోళ్లు విక్రయం



విక్రయానికి సిద్ధంగా ఉన్న కోళ్లు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివారులో మహారాష్ట్రకు చెందిన ఆయుర్వేద హనుమాన్ సంచార జాతులువారు మంగళవారం పందెం కోళ్లను విక్రయించారు. ఒక్కో కోడి ధర రూ.మూడువేల నుంచి నాలుగు వేల వరకు పలికింది. కొంతమంది మాంసం ప్రియులు పందెం కోళ్లను కొనుగోలు చేసి ఆరగించాలన్న ఆసక్తితో ధరను లెక్క చేయకుండా కొనుగోలు చేశారు.

రూ.2 లక్షలు పట్టుకున్న పోలీసులు



పట్టుకున్న వాహనంతో పోలీసులు

ధర్మారం(ధర్మపురి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం జక్కన్నపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా రూ.2,80,000 నగదు లభించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. చెక్ పోస్టు వద్ద బొలేరో వాహనం తనిఖీ చేయగా దరావత్ ఠాకూర్, లోకవత్ దేవేందర్ వద్ద రూ.55,000 లభించాయని, వీటికి ఆధారాలు చూపలేదన్నారు. అదేవిధంగా మరో బొలేరో వాహనంలో చొప్పదండికి చెందిన అంజయ్య, కుమార్, మల్లయ్య, అంజయ్య, లచ్చయ్య వెళ్తుండగా తనిఖీ చేశామన్నారు. ఇందులో రూ.2.25లక్షల నగదు లభించిందని, వీటికి ఆధారాలు చూపలేదని తెలిపారు. ఈ సొమ్మును ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు. తనిఖీల్లో ధర్మారం ఎస్సై– 2 అశ్విని, పోలీసులు పాల్గొన్నారు.

బయట తినొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య




సాహిజాద్ మృతదేహం

గోదావరిఖని: పవిత్ర రంజాన్ సందర్భంగా బయటి తిండి తొనిద్దని తండ్రి మందలించినందుకు మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఎండీ సాహిజాద్(17) ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సాహిజాద్ ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేశాడు. తరచూ బయటి తిండి తినడంతో తండ్రి గట్టిగా మందలించాడు. మనస్తాపం చెందిన సాహిజాద్ చున్నీతో తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి తండ్రి తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెగడపల్లి(ధర్మపురి): బతికపల్లి గ్రామానికి చెందిన గాజె చంద్రయ్య (55) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. చంద్రయ్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కోసం మందులు వాడినా తగ్గలేదు. ఈ క్రమంలో జీవతంపై విరక్తి చెంది ఈ నెల 15న తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలతో పంటలకు నీళ్లు



ఓదెల(పెద్దపల్లి): ఉపాధిహామీ కింద చేపట్టిన కాలువలతో పంట పొలాలకు నీళ్లు అందుతాయని డీఆర్డీఏ రవీందర్ అన్నారు. గోపరపల్లెలో ఉపాధిహామీ ద్వారా చేపట్టన కాలువల పూడికతీత పనులను పీడీ మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువనీళ్లు పంట కాలువలతో చివరి ఆ యకట్టుకు అందుతాయని తెలిపారు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో పంటలు ఎండిపోకుండా పంటలకు నేరుగా నీళ్లు పారుతాయని అ న్నారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో తిరుపతి, ఏపీవో రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు జనార్దన్, నాయక్, కార్యదర్శి ప్రసాద్, మేట్ తునికి సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సిరిసిల్ల వాసికి అయోధ్య రామయ్య వెండి నాణెం



ప్రకాశ్ అందుకున్న అయోధ్య బాలరాముడి వెండి నాణెం

సిరిసిల్లటౌన్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నాణేల కలెక్షన్ కింగ్ బుడిమె ప్రకాశ్ మరో అరుదైన నాణెం సొంతం చేసుకున్నారు. ఇటీవల అయోధ్య బాలరాముడి ఆలయం ప్రారంభంకాగా.. కోల్‌కత మింట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో ఆలయ ప్రాశస్త్యం, చరిత్రలో నిలిచేలా వెండి నాణెం తయారు చేశారు. వివిధ పత్రికల్లో నోటిఫికేషన్‌ను చూసిన ప్రకాశ్ ఫిబ్రవరి 16న కోల్‌కత మింట్‌కు ఆన్‌లైన్‌లో రూ.5,092 చెల్లించాడు. ఇందుకుగాను మంగళవారం రామ్‌లల్లా ప్యూర్ సిల్వర్ కాయిన్ ప్రకాశ్‌కు అందింది. ఇది 50 గ్రాముల ప్యూర్ సిల్వర్‌తో తయారైంది.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: తనతో గొడవపడ్డ వ్యక్తిని చంపేందుకు వెళ్లగా, సదరు వ్యక్తి పారిపోవడంతో ఆ కారణంగా అతడి స్నేహితుడిని హత్య చేసిన కేసులో నిందితులైన ఇద్దరికి యావజ్జీవశిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి సుగలి నారాయణ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం ముత్తునూర్‌కు చెందిన బైరం దామోదర్, సింగం రాజయ్య స్నేహితులు. అయితే, సాగు నీటి విషయంలో సింగం రాజయ్య, సీపతి ప్రభాకర్ మధ్య గొడవ జరుగగా, ప్రభాకర్ తలకు గాయాలైనాయి. దీంతో రాజయ్యపై కేసు నమోదైంది. అయినా రాజయ్యను ఎలాగైన చంపాలని ప్రభాకర్ తన మిత్రుడైన నేరేళ్ల రాజుతో కలిసి ప్రణాళిక రూపొందించాడు. ఈ నేపథ్యంలో 2009 డిసెంబర్ 24న రాజయ్య తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా, గ్రామ శివారులో మాటు వేసిన ప్రభాకర్, రాజు వెంబడించడంతో అతను తప్పించుకుని ఊర్లోకి వెళ్లిపోయాడు. అయితే, అదే సమయంలో రాజయ్య స్నేహితుడు బైరం దామోదర్ కూలీలతో కలిసి ఎడ్లబండిపై ఊర్లోకి వెళ్తున్నాడు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న ప్రభాకర్, రాజుకు దామోదర్ కనబడటంతో కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఎడ్లబండిలో ఉన్న కూలీలు భయభ్రాంతులతో తలోవైపు పరిగెత్తారు. మృతుడి అన్న బైరి లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి డీఎస్పీ దామెర నర్సయ్య నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి.కిరణ్‌కుమార్, ఎం.కిరణ్‌కుమార్, వి.శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం సీపతి ప్రభాకర్, నేరేళ్ల రాజుకు యావజ్జీవశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

విడాకులు ఇచ్చిన భర్తపై యాసిడ్ దాడి



గాయపడిన మహేశ్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): విడాకులు ఇచ్చిన భర్త మరో పెళ్లి చేసుకోకుండా ఉండేందుకు మాజీ భార్య యాసిడ్‌తో దాడి చేసిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎర్దండికి చెందిన నిరేటి మహేశ్ ఆదిలాబాద్ జిల్లాలో ఓ ప్రైవేటు సీడ్ కంపెనీలో సెల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల వయస్సు గల పాప ఉంది. పెళ్లి అయినప్పటి నుంచి తరచూ మనస్పర్థలు రావడంతో 11 అక్టోబర్ 2023న విడాకులు తీసుకున్నారు. కాగా మహేశ్ మరో పెండ్లి చేసుకునేందుకు నిర్ణయించుకొని ఏర్పాట్లు చేస్తుండగా.. అతడికి పెండ్లి కాకుండా ఉండేందుకు ఎదైన హాని చేయలనే ఉద్దేశంతో మంగళవారం ఉదయం లక్షణ ఎర్దండికి వచ్చింది. మహేశ్ ఇంట్లో నుంచి బయటకు రాగానే యాసిడ్ బాటిల్‌తో దాడి చేసింది. మహేశ్‌కు వీపు, ఎడమ కన్ను పై భాగంలో గాయాలైనాయి. చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

దావత్ కోసం పిలిచి దాడి చేసి

- ఫేస్‌బుక్ పరిచయంతో సిరిసిల్లకు వచ్చిన యువకుడు
- స్నేహం ముసుగులో దాడి చేసిన వైనం
- ఇద్దరి రిమాండ్

సిరిసిల్లక్రైం: ఫోన్‌లో ఏర్పడ్డ పరిచయంతో దావత్ చేసుకుందామని పిలిచి దాడి చేసిన ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాలు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి మండలం బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని చింతల్‌ఠాణాకు చెందిన సూర దేవయ్యతో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. దావత్ చేసుకుందామని ఈనెల 17న బొల్లారం నుంచి ముక్క శ్రీనివాస్‌ను సిరిసిల్లకు పిలిపించారు. సూర దేవయ్య, సూర నరేశ్ సిరిసిల్ల బస్టాండ్‌కు వచ్చి శ్రీనివాస్‌ను బైక్‌పై ఎక్కించుకొని బైపాస్‌రోడ్డుకు తీసుకెళ్లారు. ఓ ప్రాంతంలో బైక్ ఆపి శ్రీనివాస్‌పై దాడి చేసి రూ.3వేలు లాక్కున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం చంద్రంపేట క్రాసింగ్ వద్ద సూర దేవయ్య, సూర నరేశ్‌లను పట్టుకుని వారి నుంచి నగదు, సెల్ ఫోన్ సీజ్ చేసి రిమాండ్ పంపారు.